# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 126 క్రిష్ణా, శనివారం 31 - 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# అమరావతి ఇక 'క్వాంటమ్ వ్యాలీ'

## హైదరాబాద్‌ను మించేలా ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం!

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** హైదరాబాద్ నగరాన్ని తలదన్నే రీతిలో అమరావతిని అత్యద్భుతమైన మహా నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. గతంలో తానే స్వయంగా సైబరాబాద్‌ను నిర్మించి ఐటీ రంగానికి పునాదులు వేశానని గుర్తు చేస్తూ, ఇప్పుడు అమరావతిలో అంతకు మించిన సాంకేతిక విప్లవాన్ని తీసుకురాబోతున్నామని ఆయన ప్రకటించారు. రాబోయే 15 ఏళ్లలో ఈ ప్రాంతం ప్రపంచం గర్వించదగ్గ విభిన్నమైన మరియు వినూత్నమైన నగరంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

అమరావతి భౌగోళిక రూపురేఖలను మార్చేలా 182 కిలోమీటర్ల భారీ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ భారీ రోడ్డు నెట్‌వర్క్ ద్వారా గుంటూరు, విజయవాడ, మరియు మంగళగిరి ప్రాంతాలను ఏకం చేస్తూ ఒక బృహత్తర మహా నగరాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అనుసంధానత వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, పారిశ్రామికంగా మరియు ఆర్థికంగా ఈ ప్రాంతం అనూహ్య వృద్ధిని సాధిస్తుందని వివరించారు.

సాంకేతిక రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. గతంలో తన హయాంలో చేపట్టిన విద్యుత్ సంస్కరణల వల్ల రాష్ట్రం కరెంటు కష్టాల నుండి గట్టెక్కిందని, ఇప్పుడు ఇంధన రంగంలో మరో విప్లవం తీసుకురానున్నామని



చెప్పారు. వినియోగదారులు కేవలం విద్యుత్‌ను వాడుకోవడమే కాకుండా, సొంతంగా ఉత్పత్తి చేసి విక్రయించేలా 'ప్రొజ్యూమర్' కాన్సెప్ట్‌ను ప్రోత్సహిస్తామని ఆయన వెల్లడించారు. ఏపీ రాజధానిని కేవలం పరిపాలన కేంద్రంగానే కాకుండా, ఉపాధి కల్పనలోనూ నెంబర్ వన్ నగరంగా నిలబెడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాబోయే దశాబ్దంన్నర కాలంలో అమరావతిలో జరగబోయే అభివృద్ధి పనులు రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా మార్చివేస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. పట్టుదలతో పనిచేసి ఈ ప్రాంతాన్ని ఒక గ్లోబల్ హబ్‌గా మార్చి, భావి తరాలకు ఒక గొప్ప సంపదను మరియు మెరుగైన జీవన ప్రమాణాలను అందిస్తామని ఆయన ఆకాంక్షించారు.

# ఉగాది నాటికి జాబ్ క్యాలెండర్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది నాటికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుని కసరత్తు ముమ్మరం చేసింది. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.ప్రతి ఏటా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి, వాటి భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం అన్ని శాఖల నుంచి ఖాళీల జాబితాను తెప్పించుకుంటోంది. అయితే, కొత్త ఉద్యోగాల భర్తీ వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని కూడా జాగ్రత్తగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే జాబ్ క్యాలెండర్‌పై తుది ప్రకటన చేయనున్నారు.

# వైద్య రంగంలో పీపీపీ విధానం: గత ప్రభుత్వ వైఫల్యాలపై మంత్రి సత్యకుమార్ ఫైర్!



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్ల కేటాయింపులో తీసుకున్న నిర్ణయాలు విద్యార్థులకు భారంగా మారాయని మంత్రి సత్యకుమార్ తీవ్రంగా విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలో 50 శాతం కన్వీనర్ కోటా సీట్లను తప్పించి, వాటిని ఫీజులు వసూలు చేసే కేటగిరీలుగా మార్చడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల సామాన్య విద్యార్థులకు దక్కాల్సిన ఉచిత వైద్య విద్య దూరం అయిందని, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసమే అప్పట్లో అడుగులు వేశారని మంత్రి ఆరోపించారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంపై జగన్ చేస్తున్న ఆరోపణలను మంత్రి తిప్పికొట్టారు. ఈ విధానంలో భాగస్వామ్య సంస్థలే పూర్తి నిధులను భరించి ఆస్పత్రులను అభివృద్ధి చేస్తాయని, దీనివల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు. దేశ రక్షణ రంగం (నవ-టవఅఎ) వంటి కీలక విభాగాల్లో కూడా ఇదే తరహా పీపీపీ నమూనా విజయవంతంగా కొనసాగుతోందని, దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇందులో భాగంగానే ఏప్రిల్ 1 నుంచి వినూత్న మార్పులు వస్తాయని మంత్రి స్పష్టం చేశారు. సుమారు 1.43 కోట్ల మంది ప్రజలకు 25 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం ఉచితంగా అందుబాటులోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ పునరుద్ఘాటించారు. గత పాలనలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని, రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలకు సూచించారు

# జాతరకు సర్వం సన్నద్ధం



ఏలూరు కార్పొరేషన్/ఏలూరు క్రైం, జనవరి 30 : పడమరవీధిలో జరుగుతున్న గంగానమ్మ జాతర కార్యక్రమాల్లో భాగంగా మేడల్లో కొలువై ఉన్న అమ్మవార్లను శుక్రవారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్‌లు దర్శించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఐజీ, ఎస్పీలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఫిబ్రవరి 1,2 తేదీల్లో జరిగే పెద్ద జాతరకు జరిగే మహాకుంభ నివేదన తదితర కార్యక్రమాలకు నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మేడల వద్దకు అమ్మవార్లు ఏ వైపు నుంచి వస్తారు, కుంభం ఎక్కడ పోస్తారు, ఎటు నుంచి బయటకు వెళ్లారనే వివరాలను సమగ్రంగా బారికేడ్ల తిరిగి పరిశీలించారు. జాతర కొలువుల కమిటీ అధ్యక్షులు చోడే బాలసుబ్రహ్మణ్యం (బాలు), ఏపీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చోడే వెంకటరత్నం, మధ్యాహ్నపు మహేశ్వరరావు, మధ్యాహ్నపు రామకృష్ణదాసు, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మేడల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఫిబ్రవరి ఒకటవ తేదీన మహాకుంభ నివేదన జరుగు నేపథ్య ంలో శుక్రవారం మేడల్లోని అమ్మవార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి నివేదనలు సమర్పించారు. పలువురు భక్తులు సారెను అమ్మవార్లకు సమర్పం చారు. దీంతో పడమర జాతర వద్ద సందడి నెలకొంది.

నేడు మేడల వద్దకు కొర్లబండి

జాతర కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీన అమ్మవార్లను సాగ నంపే కొర్లబండిని శనివారం మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగింపుగా పడమరవీధిలోని మేడల వద్దకు తీసుకువచ్చే కార్యక్రమంలో భక్తులు పాల్గొనా లని పడమరవీధి జాతర కమిటీ అధ్యక్షులు చోడే బాల సుబ్రహ్మణ్యం(బాలు) తెలిపారు.

జాతరకు మునిసిపల్ సిబ్బంది సమాయత్తం

ఏలూరు టూటౌన్, జనవరి 30 : పడమర వీధి అమ్మవార్ల జాతర ముగింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నామని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో పెదబాబు మాట్లాడుతూ జాతరకు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే లక్షలాదిమంది ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకుని శానిటరీ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. 150మందిసిబ్బందితో మూడు షిఫ్టులు డ్యూటీలు వేశామన్నారు.

జాతరకు భారీ బందోబస్తు

ఏలూరు క్రైం, జనవరి 30 ఏలూరు నగరంలోని పడమర వీధిలో గంగానమ్మ జాతరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు డీఎస్పీ కార్యాల యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతరకు తీసుకున్న చర్యలు, ట్రాఫిక్ ఆంక్షలు, నిబంధనలను డీఎస్పీ వెల్లడించారు. ఆయనతో పాటు ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ వైను? దాకర్ పాల్గొన్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 1,2 తేదీలలో ఈ జాతర జరుగుతుందని సుమారు 6 నుంచి 7 లక్షల మంది భక్తులు రావచ్చని అంచనా వేస్తున్నా మన్నారు.

# లడ్డూ వివాదం.. చంద్రబాబుపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తు

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని వైసిపి అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి హోదాలో ఉ ండి అబద్ధపు ప్రచారం చేయడం అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పవిత్రమైన తిరుమల ప్రసాదాన్ని వివాదాల్లోకి లాగడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ వివాదానికి సంబంధించి వెలువడిన రెండు వేర్వేరు ల్యాబ్ రిపోర్టులు చంద్రబాబు వ్యాఖ్యలు తప్పని ఇప్పటికే నిరూపించాయని సజ్జల స్పష్టం చేశారు. నెయ్యి నాణ్యత విషయంలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని రిపోర్టులు చెబుతున్నా, కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పు చేశామని తెలుసుకున్నా సరే, దానిని ఒప్పుకునే విచక్షణ చంద్రబాబుకు లేదని, అందుకే పదే పదే అబద్ధాలను నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

వైసీపీ ప్రభుత్వంపై వ్యక్తిగత కక్షతోనే ఇటువంటి సున్నితమైన అంశాలను చంద్రబాబు వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. ఆరోపణలు చేయడానికి సరైన ఆధారాలు లేకపోయినా, కేవలం రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే వైసిపి నేతలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు.



అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పక్కనపెట్టి, ఇలాంటి వివాదాలతో కాలక్షేపం చేయడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు.భక్తుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ, స్వామివారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా మాట్లాడిన చంద్రబాబును ప్రజాక్షేత్రంలోనే నిలదీయాలని సజ్జల పిలుపునిచ్చారు. చేసిన పాపానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని, నిజానిజాలు త్వరలోనే ప్రజలందరికీ అర్థమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. పవిత్రమైన తిరుమల వేదికగా రాజకీయాలు చేయడం మానుకోవాలని, లేదంటే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

## ఉద్యాన పంటల అభివృద్ధి దిశగా రాష్ట్రం



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30, ఏలూరు సిటీ, జనవరి 30(ఆర్భర?ధజ్యోతి): రైతులకు మంచి ఆదాయం వచ్చేలా ఉద్యాన పంటలకు ప్రోత్సా హం అందిస్తున్నామని వ్యవసాయ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. ఏలూరులో శుక్రవారం రాష్ట్రస్థాయి కోకో కాంక్లేవ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ 'కోకో ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో ఉంది. రాష్ట్ర జీఎస్డీపీలో వ్యవసాయం రూ.50 వేల కోట్లు ఉంటే ఉద్యానవన శాఖ రూ.లక్షా 68 వేలు కోట్లు ఉంది. కోకో పంటను మరింత విస్తీర్ణంలో పెంచేలా రైతులను ప్రోత్సహించేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తిపై అధికారులు, ఉద్యానవన శాస్త్రవేత్తలతో కోకో అభ్యుదయ రైతులకు అవగాహన కల్పించటమే సదస్సు ప్రధాన ఉద్దేశం. త్వరలో విజయవాడలో అంతర్జాతీయ కాంక్లేవ్‌ను నిర్వహిస్తాం. మంత్రిని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు, అధికారులు సత్కరించారు. కోకోలో అధిక దిగుబడి, తెగుళ్ల నివారణపై కరపత్రాలను ఆవిష్కరించారు.రాష్ట్ర ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ ఈ సదస్సులో నాణ్యమైన కోకో ఉత్పత్తి, ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ, బ్యాంకర్ల సహకారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉంద న్నారు. జిల్లాలో 100 ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో భాగంగా డ్వాక్రా సంఘాలతో ఏడు చాక్లెట్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు.

ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తికి ఈ సదస్సులో శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సదస్సులో శాస్త్రవేత్తల సూచనలతో కోకో రైతులు తక్కువ ఖర్చుతో, నాణ్యమైన కోకో అధిక దిగుబడి సాధించాలన్నారు.చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో దేశంలో చింతలపూడి నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు. చాకోలేట్ ఆరోగ్యానికి మంచిదన్నారు.

ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ జిల్లాలో కోకో ప్రొసెసింగ్ యూనిట్లు, చాక్‌లేట్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు.

ఉద్యానవన శాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు, ఏలూరు ఉద్యానవన శాఖాధికారి కె.సాజానాయక్, వ్యవసా యాధికారి హబీబ్ బాషా, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏలూరు ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఆర్డీవో అంబరీష్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, హార్టీకల్చర్ వీసీ, ఉద్యానశాఖాధికారులు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అధిపతులు, సీపీసీఆర్ఐ, డీసీసీడీ, కేఏయూ, సీఏఎంపీసీఓ, ఐఐ హెచ్ఆర్, వైఎస్ ఆర్‌హెచ్‌యు పరిశోధన సంస్థలు, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ప్రతినిధులు, బ్యాంకు ప్రతినిధులు, కోకో ప్రొసెసింగ్ పెట్టుబడిదారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



క్రైం కౌంటర్ న్యూస్, డోన టౌన, జనవరి 30 : ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మల్లెంపల్లెౌరగ్రామంలో రచ్చబండ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్లకు గ్రామ నాయకులు సలీంధ్ర జయన్న యాదవ్, సుంకన్నలు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామం లో నిర్మించిన రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కోట్ల, టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్ర మంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, ఐకేపీ మల్లికార్జున, వీఆర్వో రామాంజనేయులు, టీడీపీ నాయకులు వలసల రామ కృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, భూమా నాగన్న, కొత్తకోట శ్రీను పాల్గొన్నారు.

పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూచించారు. శుక్రవారం పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు.ఎమ్మెల్యే కోట్లను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షురాలు: టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ శుక్రవారం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంప తులను పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు

# ఫోర్‌మెన్ కమిటీ విచారణపై ఉత్కంఠ

**నెల కిందట కార్మికులు కలెక్టర్‌కు ఫిర్యాదు**

**మూడు గంటల పాటు సాగిన పక్రియ**

**సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం**



క్రైం కౌంటర్ న్యూస్,నంద్యాల, జనవరి 30 : పట్టణంలోని విజయ డెయిరీలో ఫోర్‌మెన్ కమిటీ పేరుతో శుక్రవారం నలుగురు అధికారులు కలిసి పలు అంశాలకు సంబంధించిన విషయాలపై విచారణ చేయడం సర్వత్ర ఉత్కంఠ రేపుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గత నెలలో సదరు డెయిరీలో పనిచేస్తున్న కొందరు కార్మికులు కలిసి తమకు నిబంధనలు ప్రకారం బెనిఫిట్స్ అందించకపోవడంతో పాటు తగిన భద్రత.. కార్మిక చట్టం ప్రకారం వేతనాలు, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని కలెక్టర్ రాజకుమారికి ఫీర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో కలెక్టర్ నలుగురు ఉద్యోగులతో కలిసి ఫోర్‌మెన్ కమిటీ నియమించి వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని అదేశించారని ఆ వర్గాల నుంచి తెలిసింది. సదరు ఫోర్‌మెన్ కమిటీ విషయంతో కార్మికుల ఫిర్యాదు విషయం ఏమాత్రం బయటకు రాలేదు. ఉన్నఫలంగా తాజాగా సదరు డెయిరీలో విచారణ జరగడం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

త్వరలో కలెక్టర్‌కు సమగ్ర నివేదిక

సదరు ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు చేసిన విచారణ పరంగా సమగ్ర నివేదికను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. విచారణ సమయంలో సదరు డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రద?పకుమార్ సైతం అందుబాటులో లేకపోవడం గమనార్హం. డెయిరీలోని కార్మికుల పరంగా గుర్తించిన లోపాల పరంగా సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఫోర్‌మెన్ కమిటీ డెయిరీ చైర్మన్‌కు ఆదేశించారు. దీంతో మేనేజింగ్ డైరెక్టర్ రాగానే.. అందజేస్తామని చైర్మన్ పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా సదరు డెయిరీ ఎన్నికల హడావిడిపై ఉత్కంఠ రేపగా.. తాజాగా ఫోర్ కమిటీ విచారణ తో మరీ సర్వత్ర ఉత్కంఠ రేపినట్లైంది. ఫోర్‌మెన్ కమిటీ నివేదికతో భవిష్యత్‌లో ఏమైనా చర్యలు ఉంటాయో..? లేక కార్మికుల ఫిర్యాదుతోనే ఆగిపోతుందా..? అనే సందేహాలు లేకపోలేదు.

మధ్యాహ్నం 3గంటల సమయంలో..

విజయ డెయిరీలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఫోర్ మెన్ కమిటీ సభ్యులు డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఈఎ?సఐ మేనేజర్ దుర్గాప్రసాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఈపీఎఫ్ అధికారి ప్రసాద్ కలిసి తనిఖీలు చేశారు. కార్మికుల ఫీర్యాదులోని పలు అంశాలు పరంగా ఆయా బృందం సభ్యులు లోతుగా పలు రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారని తెలిసింది. కార్మికులు.. డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తోపాటు తదితర ఉద్యోగులతో సైతం పలు విషయాలపై ఆరా తీశారని తెలిసింది. కార్మికుల పరంగా కార్మికుల చట్టం ప్రకారం పలు నిబంధనలు పాటిం చలేదని గుర్తించినట్లు తెలిసింది. కార్మికుల ఈపీఎఫ్, ఈఎ?సఐ తదితర వాటిలో కూడా కొన్ని లోపాలను గుర్తించారని తెలిసింది. మొత్తంగా ఆకస్మిక ఫోర్‌మెన్ కమిటీ మూడు గంటల పాటు చేసిన తనిఖీలలో సదరు డెయిరీలోని లోపాలు ఒక్కసారిగా వెలుగు చూసినట్లైంది.

# స్పష్టత ఇవ్వని ప్రభుత్వాలు.. పరిహారంపై రైతుల్లో ఆందోళన

**ఏలూరు - ఖమ్మం జిల్లాల సరిహద్దుల్లో బొగ్గు నిక్షేపాలు**

**మారనున్న చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల దశ**

**చింతలపూడి రేచర్ల బ్లాక్‌లో 22.24 చదరపు కిలోమీటర్ల పరిధిలో తవ్వకానికి రంగం సిద్ధం**

**60 ఏళ్లపాటు ఎనిమిది వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి సరిపడా నిల్వలు**

**మా మనోభావాలతో పనిలేదా..? స్థానికుల ఆవేదన**

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30, జిల్లాలో మెట్ట ప్రాంతాలైన చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల్లో అపార బొగ్గు నిల్వలు ఉన్నట్టు నిర్ధారించిన విషయం తెలిసిందే. వీటిని వెలికితీస్తే ఈ ప్రాంతాల దశ మారనుంది. చింతలపూడి మండలం రేచర్ల బ్లాక్‌లో బొగ్గు వెలికితీతకు టెండర్లు పిలిచినా వేలం వాయిదా పడింది. కనీసం తమ దృష్టికి తీసుకురాలేదని, పరిహారం విషయం తేల్చకుండానే ఈ చర్యలేమి టంటూ స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి నియోజకవర్గంతోపాటు నూజి వీడు నియోజకవర్గంలోని చాట్రాయి, ముసునూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండి యా, లక్నోకి చెందిన బీర్బల్ సుహాని అనే సంస్థ 2013లో ఖమ్మం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలో బొగ్గు నిక్షేపాల కోసం సర్వే చేశారు.1964 నుంచి 2004 వరకు, 2006 నుంచి 2016 వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగుసార్లు సర్వే నిర్వహించింది. సర్వే సంస్థలన్నీ అయా ప్రాంతాల్లో గ్రేడ్ వన్ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని నిర్ధారించడమే గాక ఏలూరు-- ఖమ్మం జిల్లాల సరిహద్దుల్లో 2,500 చదరపు కిలోమీటర్లు పరిధిలో అపారమైన నల్లబంగారం ఉందని కేంద్రానికి నివేదికలు ఇచ్చాయి.

రేచర్ల కోల్ బ్లాక్‌లో..

చింతలపూడి మండలం రేచర్ల బ్లాక్‌లో రేచర్ల కేంద్రంగా 22.24 చదరపు కిలోమీటర్లు పరిధిలో లింగపాలెం, రాఘవాపురం, టి.నరసాపురం, ఎర్ర గుంటపల్లి, చాట్రాయి మండలం సోమవారం, ముసునూరు మండలం సూరేపల్లి, బాసవరప్పాడు, వలసపల్లి, చెక్కపల్లి గ్రామాల పరిధిలో నాణ్యమైన జి--13 గ్రేడ్ బొగ్గు నిల్వలు ఉన్నట్టు గుర్తించి కేంద్రా నికి తెలిపారు. రేచర్ల బ్లాక్‌లో బొగ్గు వెలికితీతకు రిలయన్స్ సంస్థతో పాటు యాక్సెస్ ఎనర్జీ వెంచర్స్ అనే సంస్థలు సంయుక్తంగా బిడ్ దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరులో దేశవ్యాప్తం గా 41 బొగ్గు బ్లాకులలో బొగ్గు వెలికితీతకు బిడ్ ఆహ్వానించింది. ఈ 41 బొగ్గు బ్లాక్‌లలో చింతల పూడి మండలం రేచర్ల బ్లాక్ ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల వేలం వాయిదా పడింది. ఇప్పుడు రేచర్ల బ్లాక్‌తో సహా 13 బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు వేయడానికి రంగం సిద్ధమైంది. రేచర్ల బొగ్గు బ్లాక్‌లో దొరికే బొగ్గు ద్వారా 60 ఏళ్ల పాటు నిరంతరం ఎనిమిదివేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అంచనా.



ఆందోళనలో రైతులు చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల్లో బొగ్గు నిక్షేపాలు ఏఏ గ్రామాల్లో ఉన్నాయి, ఏ గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందనే విషయంపై ఇంత వరకు కేంద్ర ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వలేదు. కనీసం గ్రామ సభలు జరిపి రైతుల మనోభావాలను తెలుసుకోలేదు. రైతులకు భూములు కోల్పోతే నష్టపరిహారం ఏమిస్తారనేది తేల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద కంపెనీలకు కొమ్ము కాయకుండా రైతుల పక్షాన నిలబడాలని ఈ నియోజకవర్గాల రైతాంగం కోరుతోంది. చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి భూములు తీసుకున్నప్పుడు మార్కెట్ రేటు రూ.30 లక్షలు ఉంటే కేవలం రూ.12 లక్షలే పరిహారం చెల్లించారు. గ్రీన్‌బెల్ట్‌కి రూ.40 లక్షల మార్కెట్ రేటు ఉంటే రూ.18 లక్షలు చెల్లించింది ప్రభుత్వం. ఇప్పుడు రైల్వే లైను, బొగ్గు గనులు అంటున్నారు. మమ్మల్ని సంప్రదించకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం విచారకరమని ఈ రెండు నియోజక వర్గాలల్లోని రైతాంగం వాపోతోంది. పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే బొగ్గు తవ్వకాలకు టెండర్లు పిలవాలని రైతులు కోరుతున్నారు. రైతులను, ప్రజలను చిన్న చూపు చూస్తూ బడా కంపెనీలకు కొమ్ము కాస్తూ ప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరిస్తూ టెండర్ల వరకు వెళ్లడం ఎంతవరకు సబబు అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

భూముల విలువకు తగ్గట్టుగా నష్టపరిహారం ఇవ్వాలిపదిహేను ఏళ్ల క్రితం వలసపల్లిలో బొగ్గు అవశేషాలు ఉన్నాయని కేంద్ర బృందాలు బోర్లు వేసి బొగ్గు పరిస్థితిని పరిశీలించారు. బొగ్గు కోసం కేంద్ర ప్రభుత్వం భూములు తీసుకుంటే ప్రస్తుతం ఎకరం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు భూమి ధర ఉన్నందున ఆ మేరకు నష్టపరిహారం చెల్లించాలి.


– మేదరమెట్ల సురేంద్రబాబు, రైతు, వలసపల్లి, ముసునూరు మండలం.

జీవనోపాధి కోల్పోతారు..

బొగ్గు కోసం ప్రభుత్వం భూములు తీసుకుంటే ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతు లు జీవనోపాధి కోల్పోతారు. వ్యవసాయ భూములు తీసుకోవడం వల్ల కుటుంబాలు ఇబ్బందులు గురవుతాయి. తప్పనిసరిగా బొగ్గు కోసం భూములే తీసుకోవాల్సిన పరిస్థితి వస్తే సన్న, చిన్నకారు రైతులకు ప్రత్యామ్నాయంగా భూములను ఇచ్చి ఆదుకోవాలి.

# బెయిల్ పై విడుదలై జగన్ ని కలిసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30, మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డిని వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆయన నివాసంలో కలిశారు. మద్యం అక్రమ కేసులో సుదీర్ఘ కాలం పాటు జైలులో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నిన్న (గురువారం) బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తనపై కూటమి ప్రభుత్వం పెట్టిన కేసులు, అలాగే తన కుమారులు, కుటుంబ సభ్యులను కూడా కేసులతో వేధిస్తున్న తీరును వైయస్ జగన్‌కు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వివరించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన వైయస్ జగన్, తప్పుడు కేసులపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, చట్టపరంగా ధైర్యంగా ఎదుర్కోవాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి భరోసా ఇచ్చారు. ప్రజల పక్షాన, ప్రజల తరఫున చేసే పోరాటంలో ఇలాంటి ఆటంకాలు, వేధింపులు సహజమేనని అన్నారు. వాటిని ధీటుగా ఎదుర్కొంటూ ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



# కబ్జా చేసేస్తాం!

**రూ.10కోట్ల స్థలం కాజేసేందుకు యత్నం**

**బోర్డులు తొలగించి.. ప్రహరీ కూల్చివేసి**

**బోర్డు బంగ్లా స్థలంలో రాత్రివేళ పనులు**

**అయినా మౌనం దాల్చిన అధికారులు**



**క్రైం కౌంటర్ న్యూస్,** నరసన్నపేట, జనవరి 30 నరసన్నపేట పట్టణ నడిబొడ్డున మార్కెట్‌లో రూ.కోట్లు విలువ చేసే బోర్డు బంగ్లా స్థలం ఆక్రమణకు గురవుతోంది. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఈ స్థలాన్ని కొంతమంది చదును చేశారు. గతంలో వైసీపీ నాయకుల అండతో అక్రమార్కులు నిర్మాణాలకు యత్నించారు. నేడు కూటమి నేత ఒకరు అక్రమ నిర్మాణాలకు కంకణం కట్టుకున్నట్టు తెలుస్తోంది. సుమారు రూ.10కోట్లు విలువైన ఈ స్థలం జిల్లాపరిషత్‌కు చెందినది. ఈ స్థలంపై గతంలో బొరిగివలసకు చెందిన ఓ ఆసామి కన్నుపడింది. అతను వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరు 16న ఆమదాలవలసకు చెందిన వ్యక్తి పేరుమీద తప్పుడు సర్వేనెంబరుతో డాక్యుమెంట్లు చేయించి.. నిర్మాణాలకు యత్నించాడు. అప్పట్లో జిల్లాపరిషత్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. గతేడాది ఫిబ్రవరి 20న మళ్లీ ఆక్రమణకు ప్రయత్నించారు. అప్పటి ఎంపీడీవో బి.మధుసూదనరావు పోలీసులకు ఫిర్యాదు చేసి సంబంధిత స్థలంలో నిర్మాణాలను అడ్డుకున్నారు. అది ప్రభుత్వ స్థలంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు.ఏడాది తర్వాత తాజాగా గురువారం రాత్రి బోర్డుబంగ్లా స్థలంలో నిర్మాణాలు చేసేందుకు కొందరు వ్యక్తులు వచ్చారు. బోర్డులను పీకేసి.. ప్రహరీని తొలగించారు. ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, సుడా నుంచి అనుమతి తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నామని చెబుతున్నారు. నిర్మాణాలకు కోర్టు అనుమతి ఇచ్చిందని పత్రాలు చూపుతున్నారు. కూటమి నేతల అండతోనే నిర్మాణాలకు సిద్ధమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

పట్టించుకోని ఉన్నతాధికారులు

బోర్డు బంగ్లా స్థలం ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గత ప్రభుత్వ హయాంలో ఎన్‌వోసీ ఇచ్చిన రెవెన్యూ అధికారులపై కానీ, బోర్డు బంగ్లా స్థలంలో నిర్మాణాలకు సుడా అనుమతులు ఇవ్వడంపై కానీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. దీంతో తరచూ ఈ స్థలంపై ఆక్రమణదారుల కన్నుపడుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సిఫారసులకు తలొగ్గి బోర్డు బంగ్లా స్థలాన్ని అప్పట్లో రెవెన్యూ అధికారులు తప్పుడు పత్రాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ పత్రాలతో 'సుడా' అనుమతి తీసుకుని.. సంబంధిత స్థలంలో నిర్మాణాలు అడ్డుకోకుండా కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చారు. గతంలో కోర్టులో పంచాయతీరాజ్, సుడా, రెవెన్యూ అధికారులు కోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. అయితే పంచాయతీరాజ్ అధికారులు కౌంటర్ దాఖలు చేసినా.. సుడా అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది ఎప్పటికప్పుడు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. బోర్డుబంగ్లా స్థలం వివాదం జరుగుతున్నా.. కూటమి నేతలు, అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. కలెక్టర్ స్పందించి ఈ ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా 'బోర్డు బంగ్లా ఆస్తిని పరిరక్షిస్తాం. నిర్మాణాలకు కోర్టు అనుమతి ఇచ్చింది బోర్డు బంగ్లా ఆస్తికి కాదు. ఆ విషయాన్ని నిర్మాణదారులు గుర్తించాలి. లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

# మహాత్మా గాంధీకి వర్ధంతి నివాళులు అర్పించిన జగన్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** జాతిపిత మహాత్మా గాంధీకి వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. "సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు" అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు" అంటూ వైయస్ జగన్ ట్వీట్ చేశారు.

# కాకినాడ జిల్లాలో పట్టుబడిన కల్తీ నూనె, నిందితులు

**ఇటీవల కాకినాడలో 840 కిలోల పట్టివేత**

**నెయ్యిదీ అదే పరిస్థితి..**

**తక్కువ ధరకు లభిస్తుండడంతో వినియోగం**

**ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** ఈ నెల 27న కాకినాడ జిల్లా ధర్మవరం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేయగా.. కల్తీ నూనె పెద్ద ఎత్తున పట్టుబడింది. తొమ్మిది మందిని అరెస్టు చేసి.. వారి నుంచి 840 కిలోల నూనెను స్వాధీనం చేసుకున్నారు. గత నాలుగు నెలలుగా ఈ దందా కొనసాగుతోంది. మన జిల్లాలోని ఇచ్ఛాపురానికి కల్తీ నూనె తరలిస్తున్నట్టు పోలీసు విచారణలో తేలింది. నూనెలో క్రూడాయిల్ కలిపినట్టు తేలడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో నూనె, నెయ్యిలో కల్తీ జరుగుతుందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఇటీవల జిల్లాకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న కల్తీ నూనె కాకినాడ జిల్లాలో దొరకడంతో నిజమని తేలింది. కొంతమంది నూనె యథేచ్ఛగా కల్తీ చేసి విక్రయిస్తూ.. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. జిల్లాకు నాణ్యత లేని నెయ్యి, నూనె సరఫరా జరుగుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. జిల్లాలో ఎక్కువగా సన్‌ఫ్లవర్, పామాయిల్, రైస్‌బ్రాన్, వేరుశెనగ నూనెను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అన్నీరకాలు కలిపి నెలకు దాదాపు 1700 టన్నుల నూనె విక్రయిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతినెలా సుమారు రూ.15కోట్ల మేర నూనె వ్యాపారం సాగుతోంది. చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో అధికంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెను ఎక్కువగా వాడుతున్నారు. మిగిలిన వాటి కంటే తక్కువ ధరకు లభిస్తుండడంతో చాలామంది వీటికే మొగ్గు చూపుతున్నారు.

నెయ్యినీ వదలట్లే..

నెయ్యిలో కూడా కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. సాధారణంగా నెయ్యిని రెండు రకాలుగా ఉత్పత్తి చేస్తారు. ఇళ్లలో పెరుగు చిలికే క్రమంలో వచ్చే వెన్నను కాయడం ద్వారా తయారు చేసేది 10 నెలలైనా నిల్వ ఉంటుంది. యంత్రంతో పాలుపోసి ఆడించిన తరువాత వచ్చే వెన్నను మరిగించి రెండో రకంగా నెయ్యిని తయారుచేస్తారు. దీని నాణ్యత నెల రోజుల తరువాత తగ్గిపోతుంది. జిల్లాలో రెండో రకం నెయ్యి ఉత్పత్తి, విక్రయాలు జరుగుతున్నాయి. అందులోనూ వనస్పతి, పామాయిల్ కలిపేసి కొందరు కల్తీ చేస్తున్నారు. బేకరీ, స్వీటుషాపు నిర్వాహకులు తక్కువ ?ధరకు లభించే కల్తీ నెయ్యి, నూనెను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో నెలకు 50వేల లీటర్ల నెయ్యి విక్రయిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రకం,



నాణ్యత బట్టి కిలో నెయ్యి రూ.350 నుంచి రూ.1000 వరకూ అమ్ముతున్నారు. రూ.2.50 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది.ఇద్దరే అధికారులు..

జిల్లాలో వేల టన్నుల నూనె, నెయ్యి విక్రయాలు జరుగుతున్నాయి. వందల కొలదీ వ్యాపారులు ఉన్నారు. కానీ ఆహార పదార్థాల కల్తీ నియంత్రణ అధికారులు మాత్రం కేవలం ఇద్దరే ఉన్నారు. ఒక్క శ్రీకాకుళం నగరంలోనే తోపుడుబండ్లు, చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సుమారు 1000వరకూ ఉన్నాయి. 30 మండలాల్లో ఆ సంఖ్య 8 వేల వరకూ ఉండొచ్చని ఒక అంచనా. నూనె, నెయ్యి సరఫరాదారులు 500 మంది వరకూ ఉంటారు. వీరందరి వద్ద కల్తీ జరగకుండా నియంత్రించాల్సిన ఇన్‌స్పెక్టర్లు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఫలితంగా ఎక్కడా తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రాణాంతక వ్యాధులు..

కల్తీ నూనె, నెయ్యితో తయారుచేసే ఆహార పదార్థాలు తింటే కేన్సర్ సంబంధిత వ్యాధులు రావొచ్చు. శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయి. వీటికి అదనంగా మలబద్దకం, ఒళ్లునొప్పులు, గుండెపోటు, పక్షవాతం వంటి రుగ్మతలు వస్తాయి. జీర్ణ వ్యవస్థ గాడి తప్పుతుంది. ఆరోగం పాడయ్యాక లక్షలు ఖర్చుపెట్టడం కంటే ముందే మేల్కోవడం ఉత్తమం.

– యుగంధర్, వైద్యుడు, రణస్థలం సీహెచ్‌సీ

ఫిర్యాదు చేయండినూనె, నెయ్యిలు కల్తీ జరిగాయని అనుమానం వచ్చిన వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. శ్రీకాకుళంలోని కార్యాలయానికి సంప్రదించాలి. లేదంటే 9398467652 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలి. తనిఖీ చేసి కల్తీ అని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఈ నెలలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్న నాలుగు షాపుల యాజమానులపై కేసులు నమోదు చేశాం. మరో 5 షాపులపై కేసులు నమోదు చేశాం.

# వికసిత భారతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** ఈ ఆదివారం యావత్ భారతదేశం దృష్టి పార్లమెంట్ వైపే నిలవనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సాధారణంగా బడ్జెట్‌ను పనిదినాల్లో ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తున్నా, ఈసారి ఆ సంప్రదాయానికి భిన్నంగా ఫిబ్రవరి 1, 2026న ఆదివారం రోజున బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం విశేషంగా మారింది. ఈ అరుదైన నిర్ణయం వెనుక స్పష్టమైన ఆర్థిక వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల స్టాక్ మార్కెట్లు, ఆర్థిక నిపుణులకు బడ్జెట్ ప్రతిపాదనలను లోతుగా అధ్యయనం చేసే అవకాశం లభిస్తుంది. తద్వారా సోమవారం మార్కెట్లు ప్రారంభమయ్యే నాటికి ఇన్వెస్టర్లు స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్లే వీలుంటుంది. ఈ మార్పుపై పెట్టుబడిదారులు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ చరిత్రను పరిశీలిస్తే గత దశాబ్ద కాలంలో అనేక పాత సంప్రదాయాలకు తెరపడినట్టు కనిపిస్తుంది. ఒకప్పుడు ఫిబ్రవరి చివరి పనిదినం సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టేవారు. కానీ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ విధానంలో కీలక మార్పులు చేశారు. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చేలా బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చగా, సమయాన్ని ఉదయం 11 గంటలకు సవరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 112 ప్రకారం ప్రభుత్వం ప్రతి సంవత్సరం తన ఆదాయ--వ్యయ అంచనాలను పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉంటుంది. రాజ్యాంగ భాషలో దీనినే వార్షిక ఆర్థిక నివేదికగా పేర్కొంటారు. ఇది దేశ ఆర్థిక పరిస్థితిని ప్రతిబింబించే అత్యంత కీలక పత్రంగా భావిస్తారు. ఈసారి బడ్జెట్‌పై ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆదాయపు పన్ను రాయితీల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయాలు తీసుకుంటుందన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. గత బడ్జెట్‌లో కొత్త పన్ను విధానం కింద రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు కల్పించిన విషయం తెలిసిందే. అయితే ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమితిని మరింత పెంచాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అలాగే స్టాండర్డ్ డిడక్షన్ పెంపు, 80జ పరిమితి సవరణ, ఆరోగ్య బీమా ప్రీమియాలపై అదనపు పన్ను మినహాయింపులు వంటి అంశాలపై కూడా పన్ను చెల్లింపుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సామాన్యుడి జేబుకు ఉపశమనం కలిగించే నిర్ణయాలు వస్తాయా లేదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారింది. ఆర్థిక సర్వే 2025--26 ప్రకారం దేశ వృద్ధిరేటు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్య ఉండే అవకాశముందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం ఉందని, దేశం గ్లోబల్ ఎకానమీలో ఆశాకిరణంగా నిలుస్తోందని ప్రధాని మోదీ ఇప్పటికే వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ సామాజిక న్యాయం, ఆర్థిక వృద్ధి, జాతీయ భద్రత రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ప్రస్తావించారు. వికసిత భారత్––2047 లక్ష్య సాధనకు ఈ బడ్జెట్ బలమైన పునాదిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.11 లక్షల కోట్ల వరకు కేటాయింపులు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఆదాయపు పన్ను రాయితీలు, అభివృద్ధి వ్యయాలు, మధ్యతరగతి ఆశలు. ఈ మూడింటికీ సమతుల్యత సాధించేలా ఈసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపుదిద్దుకోనుందని అంచనాలు వినిపిస్తున్నాయి.

# తిరుపతి లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలి

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 30,** తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు కలిపారంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ హయాంలో లడ్డూలో జంతు కొవ్వు వాడారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదా ల్యాబ్ నివేదికల నేపథ్యంలో ఒక నిర్దిష్ట ప్రకటన చేయాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని ల్యాబ్ నివేదికలు స్పష్టంగా తేల్చి చెప్పాయని సజ్జల అన్నారు. ఈ అంశంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, దీనిని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, ఇంత బాధ్యతారహితమైన ప్రకటన చేసినందుకు ఆయనను నిలదీయాలని పేర్కొన్నారు. రెండు జాతీయ ప్రయోగశాలల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా సిట్ ఇచ్చిన రిపోర్ట్‌లో లడ్డూలో జంతు కొవ్వు లేదని తేలిందని, అయినా ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో అప్పటి టీటీడీ చైర్మన్ లేదా బోర్డు సభ్యుల ప్రమేయం ఉన్నట్లు సిట్ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని సజ్జల గుర్తుచేశారు. ఇది తమకు క్లీన్‌చిట్ లాంటిదని, ఈ ఆరోపణలు న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయని తెలిపారు. వాస్తవాలు అంగీకరించకుండా, చంద్రబాబు, ఆయన ప్రచార యంత్రాంగం ఇప్పటికీ తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి 2019-24 మధ్య కాలంలోనే అవకతవకలు జరిగాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు వ్యాఖ్యల వల్లే ఈ మొత్తం విచారణ మొదలైందని, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నందున ఆయన దీనిపై కచ్చితంగా వివరణ ఇవ్వాలని సజ్జల అన్నారు.

# సినిమా



## 'ఆయన గోల్డ్ ఎహే'..

తెలుగు ఇండియన్ ఐడల్ వేదికపై నందమూరి బాలకృష్ణను కలిసిన క్షణాలను గాయని లాలస ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ అనుభవాలు తన జీవితంలోనే ది బెస్ట్ అని ఆమె పేర్కొన్నారు. బాలకృష్ణతో తన మొదటి అనుభవాన్ని వివరిస్తూ, ఎపిసోడ్ షూటింగ్ రోజు కంటెస్టెంట్లు కాస్ట్యూమ్స్ మార్చుకోవడానికి వెళ్లేలోపే బాలకృష్ణ సెట్‌కు వచ్చి కూర్చున్నారని లాలస చెప్పారు. సాధారణంగా గెస్టులు కంటెస్టెంట్ల తర్వాత వస్తారని, అయితే బాలకృష్ణ ముందుగానే రావడం ఆయన క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. ఆయన సెట్‌లో ఉండగా ఒకరకమైన నిశ్శబ్దం, భయం, గౌరవం ఉంటాయని ఆమె తెలిపారు. బాలకృష్ణ ఇంట్రడక్షన్ డాన్స్ షూటింగ్ సమయంలో.. కొరియోగ్రాఫర్ రెండు, మూడు సార్లు మాత్రమే చూపించగా, ఆయన చాలా నిశితంగా గమనించి, రెండు టేకుల్లోనే ఆ డాన్స్ మూవ్స్ పూర్తి చేశారని లాలస ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం, సీనియారిటీకి తాను సెల్యూట్ చేస్తానని అన్నారు. ఎపిసోడ్ షూటింగ్ పూర్తయిన తర్వాత బాలకృష్ణ వెళ్లిపోయారని, అయితే ఒక వారం తర్వాత తన ఫోన్‌కు ఒక మిస్డ్ కాల్ వచ్చిందని లాలస గుర్తుచేసుకున్నారు. అది నందమూరి బాలకృష్ణ నంబర్ అని గుర్తించకుండా, ఆమె తరగతిలో ఉన్నందున కాల్‌ను అటెంట్ చేయలేదు. క్లాస్ అయిపోయాక లాలస ట్రై చేస్తే బిజీ వచ్చింది. కాసేపటికి ఆమెకు మళ్లీ అదే నంబర్ నుంచి ఫోన్ రాగా, కాల్ లిఫ్ట్ చేయగా.. లాలస అని బాలకృష్ణ వాయిస్ వినిపించేసరికి తాను షాక్ అయ్యానని చెప్పారు. ఎపిసోడ్ రోజు కంగారులో ఎవరితోనూ మాట్లాడలేకపోయానని, అందువల్ల టాప్ సిక్స్‌లో ఉన్న కంటెస్టెంట్లందరికీ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడుతున్నానని బాలకృష్ణ చెప్పినట్లు లాలస వివరించారు. దాదాపు పది నిమిషాల పాటు తమ కుటుంబ సభ్యుల గురించి, ఆమె చదువు గురించి, సొంత ఊరి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారని ఆమె చెప్పారు. ఈ సంఘటన బాలకృష్ణపై తన గౌరవాన్ని మరింత పెంచిందని ఆమె అన్నారు.ఆ తర్వాత బాలకృష్ణకు కోవిడ్ వచ్చినప్పుడు, లాలస టేక్ కేర్ సర్ అని ఒక సాధారణ మెసేజ్ పంపించారు. అయితే, దానికి బాలకృష్ణ అప్పుడు రిప్లై ఇవ్వలేకపోయినా, ఒక వారం తర్వాత మళ్లీ లాలసకు స్వయంగా ఫోన్ చేసి, మెసేజ్‌కు రిప్లై ఇవ్వలేకపోయినందుకు సారీ చెప్పారని లాలస తెలిపారు. ఐదు నిమిషాల పాటు కోవిడ్ లక్షణాల గురించి అడిగి తెలుసుకున్నారని ఆమె పేర్కొన్నారు. బాలకృష్ణ వంటి గొప్ప వ్యక్తి తనతో అంత ప్రేమగా మాట్లాడటం, ఆయన నంబర్ తన వద్ద ఉండటం ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారని, అయినా కూడా తనలాంటి వారికి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడడం ఆయన గొప్పతనమే అని లాలస ప్రశంసించారు.





## ఎండిన అల్లం మహిమ..

అల్లం మన వంటగదిలో సాధారణంగా కనిపించే సుగంధ ద్రవ్యాలలో ఒకటి. టీ తయారు చేయడం నుండి కూరగాయలకు రుచికోసం అల్లాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే, ఆరోగ్యపరంగా తాజా అల్లం కంటే, ఎండిన అల్లం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. దీనిని సాధారణంగా శోంఠి అని కూడా పిలుస్తారు. ఈ ఎండిన అల్లంతో తయారుచేసిన హెర్బల్ టీ తాగడం వల్ల శరీరం దాదాపు 90--110 కేలరీలు ఎక్కువగా బర్న్ అవుతుందని అనేక అధ్యయనాల ఫలితాలు చూపించాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే శోంఠిని తీసుకోవడం వల్ల శరీరం కొవ్వును కరిగించే సామర్థ్యం దాదాపు 10శాతం పెరుగుతుంది. అంటే మీరు కొన్ని వారాల పాటు ఎండిన అల్లంను క్రమం తప్పకుండా తీసుకుంటే, మీరు సగటున 1 నుండి 1.5 కిలోల బరువు తగ్గవచ్చు. అందువల్ల, బరువు తగ్గాలనుకునే వారికి ఎండిన అల్లం తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

మైగ్రేన్, వికారం నుండి ఉపశమనం:

ఎండిన అల్లం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, నొప్పి, వికారం నుండి ఉపశమనం కలిగిస్తుంది. మైగ్రేన్లపై అధ్యయనాల్లో అల్లం నొప్పి తీవ్రతను, వికారం అనుభూతిని తగ్గిస్తుందని కనుగొన్నాయి. తేలికపాటి మైగ్రేన్లలో దీని ప్రభావం కొన్నిసార్లు ప్రామాణిక నొప్పి నివారణ మందులతో పోల్చదగినదిగా కనుగొనబడింది. ఇంకా, గర్భధారణ, చలన అనారోగ్యం, శస్త్రచికిత్స తర్వాత వికారం కోసం అల్లం యోజనాలకు బలమైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి.

ఎండిన అల్లం ఎందుకు ఎక్కువ ప్రభావవంతంగా ఉంటుంది?:


అల్లం ఎండబెట్టినప్పుడు, దానిలో ఉండే జింజెరాల్స్ అనే మూలకాలు షోగోల్స్‌గా మారుతాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. షోగోల్స్ ఎక్కువ యాంటీ ఇన్ఫ్లమేటరీగా ఉంటాయి. ఇవి శరీరంలో వేడిని ఉత్పత్తి చేయడం ద్వారా కేలరీల బర్నింగ్‌ను పెంచుతాయి. ఇవి బ్రౌన్ ఫ్యాట్‌ను యాక్టివేట్ చేస్తాయి. ఇది శరీర కొవ్వును కాల్చడంలో సహాయపడుతుంది. ఈ విధంగా, తాజా అల్లం కంటే ఎండిన అల్లం తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది.

దీన్ని ఎలా తీసుకోవాలి..?

పోషకాహార నిపుణులు ఒక కప్పు వేడి నీటిలో 1/2 నుండి 1 టీస్పూన్ ఎండు అల్లం పొడిని కలిపి త్రాగాలని సిఫార్సు చేస్తున్నారు.

ఏ సమయంలో తీసుకోవాలి?

మీరు దీన్ని ఎప్పుడైనా తినవచ్చు, అయితే ఉదయాన్నే ఎండిన అల్లం నీరు తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జీవక్రియను పెంచడానికి ఉదయం ఇది చాలా మంచిది. మైగ్రేన్లు లేదా వికారం కోసం, మీరు భోజనం తర్వాత ఈ నీటిని తాగొచ్చు.



## అరటి పండ్లు.. ఖర్జూరం.. తక్షణ శక్తి కోసం ఏది తినాలో తెలుసా?

ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరిలో అలసట, బలహీనత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రారంభమైతే.. మళ్లీ రాత్రి నిద్రపోయే వరకు ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అటువంటి సమస్యల నుంచి బయటపడటానికి సులభమైన మార్గాన్ని నిపుణులు చెబుతున్నారు. అదేంటంటే.. ఈ అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. కాబట్టి ఈ రెండు ఆహారాల మధ్య తేడా ఏమిటో, ఆరోగ్యానికి ఏది మంచిదో ఇక్కడ తెలుసుకుందాం..

ఒక అరటిపండులో దాదాపు 105 కేలరీలు ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అరటిపండ్లతో పోలిస్తే, ఖర్జూరం కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మూడు లేదా నాలుగు ఖర్జూరాలు తినడం వల్ల మీకు 90 నుంచి 120 కేలరీల శక్తి లభిస్తుంది. అంతే కాదు వాటిలో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఎక్కువసేపు వ్యాయామం చేయాలనుకునేవారికి లేదా రోజంతా ఉత్సాహంగా పనిచేయాలనుకునే వారికి, అరటిపండ్లు మంచివి. వాటిలోని ఫైబర్ చక్కెరను నెమ్మదిగా రక్తంలోకి విడుదల చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం శక్తిని అందించడానికి సహాయపడుతుంది.

శీఘ్ర శక్తికి ఏది మంచిది?

వ్యాయామం తర్వాత అలసిపోయినా లేదా నీరసంగా అనిపించినా తక్షణ శక్తి కోసం ఖర్జూరం తినడం మంచిది. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. శరీరానికి వెంటనే గ్లూకోజ్‌ను అందిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు ఖర్జూరాన్ని తినేందుకు ఇష్టపడతారు. కానీ డయాబెటిస్ ఉన్నవారు వీలైనంత వరకు ఖర్జూర వినియోగాన్ని నియంత్రించుకోవాలి. కండరాల తిమ్మిరితో బాధపడేవారు కూడా ఖర్జూరం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలు త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

## ఆఖరి పోరులో టీమిండియా విలన్‌పై వేటు..

భారత్, న్యూజిలాండ్ మధ్య ఉత్కంఠగా సాగుతున్న టీ20 సిరీస్ చిట్టచివరి అంకానికి చేరుకుంది. తిరువనంతపురంలో జరగనున్న ఐదవ, ఆఖరి టీ20 మ్యాచ్, సిరీస్ ఫలితం కంటే కూడా టీమిండియా ప్రపంచకప్ సన్నాహకాలకు అత్యంత కీలకం కానుంది. భారత్ ఇప్పటికే సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకున్నప్పటికీ, నాలుగో మ్యాచ్‌లో ఎదురైన ఓటమి టీం మేనేజ్‌మెంట్‌ను పునరాలోచింపజేసింది. టీ20 ప్రపంచకప్‌నకు ముందు తమ ఆధిక్యాన్ని 4-1కి పెంచుకోవడంతో పాటు, తమ పర్ఫెక్ట్ ప్లేయింగ్ ఎలెవెన్‌ను కనుగొనడానికి భారత్ ఈ మ్యాచ్‌ను ఒక అవకాశంగా చూస్తోంది.నాలుగో మ్యాచ్‌లో టీమిండియా చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో బరిలోకి దిగడం వల్ల బ్యాటింగ్ డెప్త్ తగ్గింది. కీలకమైన ఛేజింగ్‌లో టీమిండియా తడబడింది. ఈ అనుభవంతో, ఆఖరి మ్యాచ్‌లో సరైన, బలమైన జట్టుతోనే భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రపంచకప్‌నకు ముందు తుది జట్టుపై స్పష్టత రావడానికి ఇది చివరి అవకాశం కావడంతో, ఫస్ట్ ఛాయిస్ ఆటగాళ్లతోనే భారత్ మైదానంలోకి దిగనుంది.

ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ బరిలోకి దిగుతారని అంచనా. అభిషేక్ శర్మ దూకుడు మీదున్నా, రెండు మ్యాచ్‌లలో డకౌట్ అవ్వడం, మరో రెండు మ్యాచ్‌లలో హాఫ్ సెంచరీలు సాధించడం అతని ఫామ్‌కు అద్దం పడుతుంది. తిరువనంతపురంలో అతనిపై భారీ అంచనాలున్నాయి. అయితే, సంజూ శాంసన్ ఫామ్ టీం మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. టీ20 ప్రపంచకప్‌లో ఆత్మవిశ్వాసంతో ఆడాలంటే శాంసన్ ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ తిరువనంతపురంలో తిరిగి జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్, ఐదో స్థానంలో పేస్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య ఆడతారు. పరిస్థితిని బట్టి శివం దూబే, రింకూ సింగ్ వంటి ఆటగాళ్లకు అవకాశం దక్కవచ్చు.

బౌలింగ్ విభాగంలోనూ కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. గత రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న అక్షర్ పటేల్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. గత మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించిన హర్షిత్ రాణాను కొనసాగిస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడిన బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్‌లలో ఒకరికే అవకాశం దొరకవచ్చు. వరుణ్ చక్రవర్తి స్పిన్ అటాక్‌లో కీలకంగా మారనున్నాడు. యువ పేసర్ అర్షదీప్ సింగ్ పైన కూడా అంచనాలు నెలకొన్నాయి.

అయితే, శ్రేయస్ అయ్యర్‌కు మాత్రం మరోసారి నిరాశ తప్పేలా లేదు. అతను టీ20 ప్రపంచకప్ జట్టులో లేకపోవడంతో, కివీస్‌తో మ్యాచ్‌లలో అతనికి అవకాశాలు లభించడం లేదు. ఇషాన్ కిషన్ తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నందున, టీం మేనేజ్‌మెంట్ అయ్యర్ వైపు చూడటం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా, తిరువనంతపురంలో భారత తుది జట్టు కూర్పుపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ప్రపంచకప్‌కు ముందు ఈ మ్యాచ్ టీమిండియాకు ఒక కీలకమైన పరీక్ష వంటిది.




## టీమిండియాకు భారీ ఊరట..

న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా సైడ్ స్ట్రెయిన్ గాయానికి గురైన వాషింగ్టన్ సుందర్, ప్రస్తుతం కోలుకునే ప్రక్రియలో ఉన్నాడు. తాజా నివేదికల ప్రకారం, ఆయన ఇప్పటికే బ్యాటింగ్ ప్రారంచినట్లు తెలుస్తోంది. మరో రెండు మూడు రోజుల్లో బౌలింగ్ కూడా మొదలుపెట్టనున్నాడు. స్వల్పంగా ఎముక చిట్లినట్లు మొదట గుర్తించినప్పటికీ, అది పెద్ద సమస్య కాదని, షెడ్యూల్ ప్రకారమే నయమవుతుందని వైద్య నిపుణులు ధృవీకరించారు.

సూపర్ 8 లక్ష్యంగా వ్యూహాలు.. ఫిబ్రవరి 7న అమెరికాతో జరగనున్న తొలి మ్యాచ్‌కు సుందర్ అందుబాటులో ఉండటం అనుమానమే అయినప్పటికీ, మేనేజ్మెంట్ ఆయనను జట్టుతోనే ఉంచాలని నిర్ణయించింది. జట్టులో ఉన్న ఏకైక స్పెషలిస్ట్ ఆఫ్-స్పిన్నర్ కావడంతో, టోర్నీ సెకండాఫ్ (సూపర్ 8) లో ఆయన పాత్ర అత్యంత కీలకం కానుంది. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నప్పుడు పవర్ ప్లేలో సుందర్ బౌలింగ్ టీమ్ ఇండియాకు ప్రధాన అస్త్రం.

తిలక్ వర్మ ఫిట్‌నెస్ అప్‌డేట్.. మరోవైపు యువ బ్యాటర్ తిలక్ వర్మ కూడా పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్ టీ20 సిరీస్ ముగిసిన తర్వాత ముంబైలో జట్టుతో కలిసే అవకాశం ఉంది. ప్రపంచకప్ కంటే ముందు జరిగే రెండు వార్మప్ మ్యాచ్‌లకు ఆయన అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. వైద్య సిబ్బంది క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే తిలక్ వర్మ వరల్డ్ కప్ సన్నాహాల్లో పాల్గొంటాడు. జట్టు సమతుల్యతలో సుందర్ కీలకం.. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ మధ్య ఓవర్లలో రాణిస్తున్నా, పవర్ ప్లేలో పరుగులు కట్టడి చేస్తూ వికెట్లు తీయగల సామర్థ్యం వాషింగ్టన్ సుందర్ సొంతం. అంతేకాకుండా, లోయర్ ఆర్డర్‌లో ఆయన అందించే బ్యాటింగ్ లోతు జట్టుకు అదనపు బలాన్నిస్తుంది. రియాన్ పరాగ్ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో, సుందర్ 100 శాతం ఫిట్‌గా లేకపోయినా ఆయనను జట్టులో కొనసాగించడానికి మేనేజ్మెంట్ సిద్ధంగా ఉంది.

బీసీసీఐ వైద్య బృందం సుందర్ విషయంలో ఎటువంటి తొందరపాటు ప్రదర్శించడం లేదు. అధికారిక వార్మప్ మ్యాచ్‌లు మిస్ అయినా, టోర్నీ ప్రారంభం నాటికి ఆయన జట్టుతో కలుస్తారు. సూపర్ 8 వంటి హై-స్టేక్స్ మ్యాచుల్లో సుందర్ ఉనికి భారత్‌కు కలిసొచ్చే అంశం.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com